క్లుప్తంగా

పౌష్టికాహారంతో ఆరోగ్యం



న్యూట్రిషన్ ప్యాకెట్లు అందజేస్తున్న వైకేపీ ఏపీఎం, అంగన్‌వాడీ సూపర్‌వైజర్

మద్దికెర: పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉంటారని వైకేపీ ఏపీఎం మధుబాబు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సౌభాగ్యలక్ష్మి సూచించారు. బుధవారం స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో బాలింతలు, గర్భిణులకు అవగాహన కార్యక్రమం నిర్వహించి న్యూట్రిషన్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మన ఇంట్లోనే ఆరోగ్యకరమైన ఆకుకూరలు పండించుకునేందుకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తుందన్నారు. మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ టీచర్లు పద్మజ, రాజేశ్వరి, విజయలక్ష్మి, విశాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన పంటల సాగుపై ఆసక్తి

మద్దికెర: మండలంలోని ఆయా గ్రామాలల 81 మంది రైతులు దాదాపు 225 ఎకరాలలో ఉద్యాన పంటలు సాగుచేసేందుకు ఆసక్తి చూపుతున్నారని ఏపీఓ రవీంద్రనాథ్ పేర్కొన్నారు. ఆయన బుధవారం పెరవలి, మద్దికెరలో పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ఏడాది ఎక్కువ మంది రైతులు పండ్ల తోటల పెంపకానికి ఆసక్తి చూపడం హర్షించదగ్గ విషయమన్నారు. అర్హతలు కలిగిన రైతులకు మూడేళ్ల పాటు రాయితీలు, నిర్వహణ ఖర్చులు మంజూరు చేస్తామని వెల్లడించారు.

నర్సరీలో మొక్కల అపహరణ



మొక్కలు ఎత్తుకెళ్లి ట్రేలను పారేసిన దృశ్యం

మద్దికెర: స్థానిక గుంతకల్లు రహదారిలోని నర్సరీలో బుధవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు దాదాపు 30 వేల మిరప మొక్కలు ఎత్తుకెళ్లినట్లు యజమాని రమణ వాపోయారు. మిరప మొక్కలకు మంచి డిమాండ్ ఉండడంతో నర్సరీలో అందుబాటులో ఉంచామన్నారు. దొంగలు అదునుచూసి రూ. 60 వేలు విలువైన మొక్కలు ఎత్తుకెళ్లారని ఆవేదన వ్యక్తం చేశారు.

క్విజ్ పోటీల్లో ప్రతిభ



విద్యార్థులకు సర్టిఫికెట్‌లను అందజేస్తున్న దృశ్యం

హొళగుంద: కల్లూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం రిజర్వ్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా సూచనల మేరకు ఎస్‌బీఐ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి క్విజ్ పోటీల్లో హొళగుంద జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు సందేశ్, రాఘవేంద్ర ప్రతిభ కనబరిచి మొదటి బహుమతి గెలుచుకున్నట్లు హెచ్‌ఎం నజీర్ అహ్మద్ బుధవారం తెలిపారు. సదరు విద్యార్థులు రూ.10 వేల నగదు, సర్టిఫికెట్ అందుకున్నారు. క్విజ్‌లో ప్రతిభ చాటిన విద్యార్థులను హెచ్‌ఎంతో పాటు ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు అభినందించారు.వీరు జూలై 14న విశాఖపట్నంలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు హెచ్‌ఎం వెల్లడించారు.

జగనన్న సురక్ష పక్కాగా నిర్వహించాలి



అధికారులతో మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి శ్రీనివాసులు

హాలహర్వి: సమస్యల పరిష్కారం కోసమే 'జగనన్న సురక్ష' కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందని మండల ప్రత్యేకాధికారి శ్రీనివాసులు అన్నారు. ఈ మేరకు బుధవారం మండలంలోని కామినహాల్ గ్రామంలో 'జగనన్న సురక్ష' కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సచివాలయ అధికారులు, గృహసారథులు జూలై 1 నుంచి ప్రతి ఇంటికీ వెళ్లి అర్హత ఉండి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందని వారి వివరాలను సేకరించి పథకాలు వర్తింపజేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఎంపీడీఓ ఆంథోని, తహసీల్దార్ మల్లికార్జున, వీఆర్వో రాఘవేంద్రస్వామి, ఉన్నారు.

4 నుంచి శిక్షణ తరగతులు

ఎమ్మిగనూరుటౌన్: ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో రాయలసీమ స్థాయి విద్య, వైజ్ఞానిక, రాజకీయ సైద్ధాంతిక శిక్షణా తరగతులను జూలై 4, 5, 6 తేదీల్లో మంత్రాలయంలో నిర్వహించనున్నట్లు ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీరాములు గౌడ్, సహాయ కార్యదర్శి విజయేంద్ర పేర్కొన్నారు. ఈ మేరకు స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ఆవరణలో కరపత్రాలను ఆవిష్కరించారు. నాయకులు థామస్, మునిస్వామి, ఖాదర్ పాల్గొన్నారు.

రైతుల వద్దకే బ్యాంకింగ్ సేవలు

- రైతు భరోసా కేంద్రాల ద్వారా లావాదేవీలు
- ఆలూరు వ్యవసాయ సబ్ డివిజన్‌లో 76 ఆర్బీకేలు
- హర్షం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు

ఆలూరు రూరల్: రైతుల అభ్యున్నతికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసింది. వీటి ద్వారా రైతులకు గ్రామాల్లోనే విత్తనాలు, ఎరువులు పురుగు మందులను అందుబాటులోకి తెచ్చింది. ఆర్బీకేల సేవలు విజయవంతం కావడంతో రాష్ట్ర ప్రభుత్వం ఏడాది క్రితం బ్యాంకింగ్ సేవలు కూడా రైతు భరోసా కేంద్రాల్లో ప్రారంభించింది. రైతులు ఇకపై ఆర్థిక లావాదేవీలకు బ్యాంకులకు వెళ్లాల్సిన అవసరం ఉండదు. సాగు పెట్టుబడికి సంబంధించి రుణాల కోసం గతంలో రైతులు బ్యాంకులకు వెళ్లేవారు. ఇకపై వెళ్లనవసరం లేదు. సమయం ఆదా అవుతుంది. బ్యాంకు ప్రతినిధులు రైతు భరోసా కేంద్రాలకు వచ్చి సేవలందించేలా ప్రభుత్వం వెసలుబాటు కల్పించింది.

ఆర్బీకేల ద్వారా లావాదేవీలు

ఆలూరు వ్యవసాయ సబ్‌డివిజన్ వ్యాప్తంగా 76 రైతు భరోసా కేంద్రాలు ఉన్నాయి. వీటిలో రైతులు ఆర్థిక లావాదేవీలు నిర్వహించుకునేలా వివిధ బ్యాంకులకు చెందిన బ్యాంకు ప్రతినిధులను ఏర్పాటు చేశారు. వీరిని 76 ఆర్బీకేలతో మ్యాపింగ్ ప్రక్రియ పూర్తి చేశారు. 76 ఆర్బీకేల్లో బ్యాంకింగ్ కరస్పాండెంట్లు సేవలు అందిస్తున్నారు.

అందుబాటులో బ్యాంకింగ్ సేవలు

బ్యాంకు అధికారులు రోజు వారికి కేటాయించిన సమయంలో ఆర్బీకేల్లో ఉంటారు. రైతులతో పాటు గ్రామస్తులు కూడా రోజు రూ.20 వేల వరకు నగదు తీసుకోవచ్చు. అదేవిధంగా రూ.20 వేల వరకు డిపాజిట్ చేయవచ్చు. బ్యాంకు లావాదేవీలకు సంబంధించి ఎలాంటి చార్జీలు, పర్సంటేజీలు తీసుకోరు. కొత్త రుణాల మంజూరుకు సంబంధించిన ప్రక్రియ కూడా ఇక్కడే చేసుకోవచ్చు. కొత్త బ్యాంకు ఖాతా ప్రారంభించడం, బ్యాంకు సేవలపై అవగాహన కల్పించడం, రుణాల రికవరీ, బ్యాంకు నుంచి తీసుకున్న నగదు వంటి వివరాలను బ్యాంకు అధికారుల ద్వారా తెలుసుకోవచ్చు. గ్రామంలోని ఆర్బీకేల్లోనే బ్యాంకింగ్ సేవలు అందుబాటులోకి రావడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



కురుకుంద గ్రామంలోని ఆర్బీకేలో అందుబాటులో ఉన్న బ్యాంకు అధికారులు

సమయం ఆదా



ప్రభుత్వం ఆర్బీకేల ద్వారా బ్యాంకు సేవలను అందుబాటులోకి తేవడం సంతోషదాయకం. మా గ్రామం నుంచి ఆలూరు బ్యాంక్‌కు వె వెళ్లాలంటే 20 కిలోమీటర్లు ప్రయాణం చేయాలి. వ్యవసాయ పనులు వదులుకొని బ్యాంకుల వద్ద పడిగాపులు కాయాల్సి వచ్చేది. ప్రస్తుతం మా గ్రామంలోని ఆర్బీకేల్లోనే నగదు లావాదేవీలు జరుగుతున్నాయి. దీంతో సమయం ఆదా అవుతోంది. రూ.20 వేల వరకు బ్యాంకు అధికారులు ఇక్కడే ఇస్తున్నారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం హర్షణీయం. – వెంకటేష్, మండల అగ్రిబోర్డు చైర్మన్, కురుకుంద

బ్యాంకింగ్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి



ఆర్బీకేల ద్వారా అందుబాటులోకి వచ్చిన బ్యాంకింగ్ సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి. బ్యాంకు అధికారులతో రైతు భరోసా కేంద్రాలను మ్యాపింగ్ పూర్తి చేశాం. రైతులు వ్యవసాయ పనులు వదులుకొని మండల కేంద్రాలకు వెళ్లాల్సిన అవసరం లేదు. ఈ సేవలు ఎంతో ఉపయోగపడతాయి. రైతులు వారి గ్రామాల్లోని ఆర్బీకేల్లో బ్యాంకు అధికారులు కేటాయించిన సమయంలో వెళ్లి లావాదేవీలు చేసుకోవాలి. రూ.20 వేల నగదు డ్రా చేసుకోవడం, డిపాజిట్ చేసుకోవచ్చు. – సునీత, ఏడీఏ, ఆలూరు

నిబంధనలు పాటించాలి



మాట్లాడుతున్న హార్టికల్చర్ ఆఫీసర్ విజయలక్ష్మి

వెల్దుర్తి: నారు మొక్కలు పెంచే నర్సరీ నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనలు విధిగా పాటించాలని కర్నూలు ఉద్యాన శాఖాధికారి విజయలక్ష్మి ఆదేశించారు. ఆమె బుధవారం వెల్దుర్తి ఆర్‌బీకే–1లో ఏఓ అక్బర్‌బాషాతో కలిసి మండలంలోని నర్సరీల యజమానులతో సమావేశమయ్యారు. కంపెనీల నుంచి విత్తనాలు కొనే సందర్భంగా బిల్లులు తప్పనిసరిగా తీసుకోవడంతోపాటు, నారు మొక్కలు విక్రయించేటప్పుడు రైతులకు బిల్లులు ఇవ్వాలన్నారు. క్రయ, విక్రయాలు, స్టాకు రిజిస్టర్ల నిర్వహణ తప్పనిసరి అన్నారు. మండలవ్యాప్తంగా వెల్దుర్తి, రామళ్లకోట, పుల్లగుమ్మి, కలుగొట్ల గ్రామాలలోని 21 నర్సరీలలో 16 ఇప్పటికే లైసెన్స్‌లు కలిగి ఉన్నాయని, మిగతా వాటి దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. నిబంధనలు పాటించని వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. వీహెచ్‌ఏ సాంబశివుడు పాల్గొన్నారు.

మాట తప్పని నేత జగనన్న



పత్తికొండలో లబ్ధిదారురాలికి సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

పత్తికొండటౌన్: మాట తప్పని నేత సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మేనిఫెస్టోలో పేర్కొన్న హామీలన్నీ నెరవేర్చారని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. బుధవారం పత్తికొండ గ్రామ సచివాలయం–4 పరిధిలోని టీచర్స్ కాలనీ, యశోదా గార్డెన్ కాలనీలలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. వారి కుటుంబానికి ఏ పథకం ద్వారా ఎంత లబ్ధి కలిగిందో వివరిస్తూ బ్రోచర్లను అందజేశారు. ప్రజా సమస్యలు ఓపిగ్గా విని వెంటనే పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే నేరుగా తమ ఇంటివద్దకే వచ్చి సమస్యలు తెలుసుకుంటుండటంతో ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీదేవి మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ నాలుగేళ్ల పాలనలో ఎన్నికల మ్యానిఫెస్టోలోని 98.6 శాతం హామీలను అమలుచేశామన్నారు. దళారుల ప్రమేయం లేకుండా, ప్రజలకు ఇబ్బంది కలగకుండా అర్హులైన వారందరికీ ఇంటివద్దకే సంక్షేమ పథకాలు అందిస్తున్నారని వివరించారు. ప్రజాసంక్షేమ పాలన అందిస్తున్న జగనన్నను నిండు మనసుతో ఆశీర్వదించాలని, అభివృద్ధి చేసే ప్రభుత్వానికి అండగా నిలవాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. ఎంపీపీ నారాయణదాసు, సర్పంచ్ కొమ్ముదీపిక, నాయకులు ఎస్.నాగరత్నమ్మ, సోమశేఖర్, పల్లె ప్రతాప్‌రెడ్డి, లక్ష్మీకాంతమ్మ, నీలకంఠ, శ్రీరంగడు, చంద్రశేఖర్‌రెడ్డి, భాస్కర్ నాయక్, రంగన్న, సుంకన్న, శ్రీకాంత్‌రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, వక్ఫ్‌బోర్డు జిల్లా డైరెక్టర్ టీఎండీ హుసేన్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పట్టణాభివృద్ధే లక్ష్యం

ఎమ్మిగనూరుటౌన్: పట్టణ ప్రజల అవసరాలకు అనుగుణంగా పలు వార్డుల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని 16వ వార్డులో రూ.40 లక్షలతో చేపట్టనున్న కల్వర్టు నిర్మాణానికి, 14వ వార్డులో రూ.8.5 లక్షలతో, 5, 6వ వార్డుల్లో రూ.20 లక్షలతో మంచినీటి పైప్‌లైన్ల ఏర్పాటుకు, 6వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం నిధులు రూ.5 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, ఆయా వార్డు కౌన్సిలర్లు వాహిద్, ఖాశింబేగ్, ఎంకే శివప్రసాద్, అమాన్, రామాంజినిరెడ్డిలతో కలిసి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణంలో దశలవారీగా సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మిస్తున్నట్లు తెలిపారు. తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు జీడీపీ నుంచి ఏఐబీ స్కీం కింద రూ.142 కోట్లతో పైప్‌లైన్లు ఏర్పాటు చేసి కొళాయిల ద్వారా నీటిని సరఫరా చేసేందుకు మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకుంటున్నారని పేర్కొన్నారు. మున్సిపల్ డీఈలు మనోహర్‌రెడ్డి, నీరజ, ఏఈ శరత్, కౌన్సిలర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు బుట్టారంగయ్య, రియాజ్‌అహమ్మద్, వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, వహబ్, మురహరి రాజశేఖర్, బజారి, రంగన్న, రజాక్, లియాఖత్, శ్రీను, సయ్యద్‌చాంద్ తదితరులు పాల్గొన్నారు.



కల్వర్టు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి, కమిషనర్ గంగిరెడ్డి

పథకాలు సద్వినియోగం చేసుకోండి

ఎమ్మిగనూరుటౌన్: ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ఎస్సీలు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యుడు బసవరాజు సూచించారు. బుధవారం పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. బడుగుల అభ్యున్నతికి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అనేక సంక్షేమ పథకలను ప్రవేశపెట్టారన్నారు. తల్లిదండ్రులపై పిల్లల చదువుల భారం పడకుండా అమ్మఒడి, విద్యాదీవెన, వసతి దీవెన లాంటి పథకాలు ఎంతో ఉపయోగపడుతున్నాయన్నారు. రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 150 అడుగుల విగ్రహాన్ని విజయవాడలో ఏర్పాటు చేస్తున్న ఘనత సీఎం జగన్‌కే దక్కిందన్నారు. గత ప్రభుత్వాలు దళితుల అభ్యున్నతి పట్ల చొరవ చూపలేదని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆర్థికంగా, రాజకీయంగా చేయూత అందించిందని వివరించారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల విషయంలో రాజీ పడకుండా కఠినంగా వ్యవహరిస్తున్నట్లు చెప్పారు. ఆదోని సబ్‌కలెక్టర్ అభిషేక్‌కుమార్‌తో పాటు పలు దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యుడు బసవరాజు

బక్రీద్ తోఫా పంపిణీ

పత్తికొండ రూరల్: పేద ముస్లింలకు బక్రీద్ పండుగ సందర్భంగా మైత్రి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో తోఫా పంపిణీ చేశారు. బుధవారం స్థానిక శ్రీషిరిడీ సాయిబాబా దేవాలయం ఆవరణలో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్.రామ్మోహన్, కేడీసీసీ బ్యాంకు మాజీ వైస్‌చైర్మన్ ఎస్.రామచంద్రారెడ్డి చేతుల మీదుగా 120 మంది ముస్లిం మహిళలకు చీర, సేమియా ప్యాకెట్లు, చక్కెర అందజేశారు. బక్రీద్ పండుగను సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఆలయ సిబ్బంది, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.



ముస్లింలకు కానుకలను అందిస్తున్న ఎస్.రామచంద్రారెడ్డి

బక్రీద్ వేడుకలకు సిద్ధం

ఎమ్మిగనూరు: ముస్లింలు దాతృత్వానికీ ప్రతీకగా జరుపుకునే బక్రీద్ పండగకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. గురువారం జరిగే పండుగ కోసం పట్టణంలోని మసీదులను ముస్తాబు చేశారు. జామియా మసీదు, ఆలే అదిస్ (మర్కాజ్) మసీదు, సుల్తానా మసీదు, ఆఫీజ్ మసీదు, ముగతి పేట మసీదు, సున్నంబట్టి మసీదులతో పాటు మరో 17 మసీదులు, సున్నీ జమాత్ ఈద్గా, ఆలే అదిజ్ (మర్కాజ్) ఈద్గాలను బక్రీదు పండుగ కోసం ముస్తాబు చేశారు. ఆలే అదిజ్ ఈద్గాలో ఉదయం 7 గంటలకు, సున్నీ ఈద్గా జమాత్‌లో ఉదయం 9 గంటలకు ప్రత్యేక నమాజ్ జరుగుతుందని ముస్లిం పెద్దలు పేర్కొన్నారు. ఈద్గాలకు రాలేని వారు తమ సమీపంలోని మసీదులలో ప్రార్థనల్లో పాల్గొంటున్నారు.

దాతృత్వానికీ ప్రతీక

హజరత్ ఇస్మాయిల్ ప్రవక్తతో ఆకాశవాణి మాట్లాడుతూ తన కుమారుడిని బలిదానం చేయమని కోరుతోంది. అందుకు అంగీకరించి అత్యంత భక్తిభావంతో హజరత్ ఇస్మాయిల్ తన కుమారుడైన హజరత్ ఇబ్రహీం (ఖలీదుల్లా)ను బలివ్వబోగా ఆయన స్థానంలో గొర్రె (బకరా)ను బలితీసుకుంటుంది. భగవంతుని ఆదేశాలతో తన కుమారుడినే బలిదానం చేయడానికి సిద్ధపడ్డ హజరత్ ఇస్మాయిల్ దాతృత్వానికి ప్రతీకగా బక్రీద్ పండుగ నిర్వహిస్తారు. త్యాగానికి, దానానికీ ప్రతీకగా జరుపుకుంటారు. మొట్టమొదట మహమ్మద్ ప్రవక్త ఈ నియమాన్ని ఆచరించడంతో ముస్లింలు అంతా ఇదే ఆనవాయితీని కొనసాగిస్తున్నారని ముస్లిం పెద్దలు పేర్కొంటున్నారు. బక్రీదు పండుగరోజు ఒక వ్యక్తి ఒక పొట్టేలునుగానీ, ఏడుగురు వ్యక్తులు కలసి ఒక ఒంటెనుగానీ దానం ఇవ్వాలనీ ఆచారం. మాంసమను మూడు భాగాలుగా విభజించి కుటుంబ సభ్యులకు ఒక భాగం, ఆప్తులకు రెండో భాగం, నిరుపేదలకు మూడో భాగం పంచడం బక్రీదు పండుగ ప్రత్యేకత. దైనందిత జీవితంలో మనుషుల సంపాదనను కూడా ఈ విధంగా పంచాలన్నదే బక్రీద్ సందేశంగా పేర్కొంటారు.

వేదావతి నీటిని ఆస్పరికి తెప్పిస్తాం

- కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం హామీ
- జొహరాపురంలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

ఆస్పరి: వేదావతి ప్రాజెక్టు నుంచి ఆస్పరి మండలానికి సాగు, తాగు నీరు అందించేందుకు కృషి చేస్తానని కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం హామీ ఇచ్చారు. ఆయన బుధవారం మండలంలోని జొహరాపురం గ్రామంలో సర్పంచ్ నెల్లూరప్ప, ఎంపీటీసీ శ్రీరాములు ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రూ.23 లక్షలతో నిర్మించిన మంచినీటి సంపు, సచివాలయ భవనాన్ని మంత్రి ప్రారంభించారు. అంతకుముందు సచివాలయం ఉద్యోగులతో సమావేశమై ప్రభుత్వ పథకాలపై సూచనలు, సలహాలు చేశారు. అనంతరం గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు అందుతున్నాయా? లేదా? అని ఆరాతీశారు. లబ్ధిదారులకు సంక్షేమ క్యాలెండర్ అందజేశారు. ఎస్సీ, బీసీ కాలనీల్లో మంచి నీటి పైపులైన్ల కోసం రూ.20 లక్షలు మంజూరు చేశారు. మంత్రి మాట్లాడుతూ.. ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు వల్ల ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూరిందన్నారు. అందరికీ మేలు చేసే జగనన్నకు ప్రజలు అండగా నిలవాలని కోరారు. ఆలూరు నియోజకవర్గంలోని 5 మండలాలకు హెచ్‌ఎల్‌సీ, ఎల్‌ఎల్‌సీ, హంద్రీ నీవా ద్వారా నీటి సరఫరా ఉందని, ఆస్పరి మండలానికి మాత్రం నీరు రావడం లేదన్నారు. వేదావతి ప్రాజెక్టులో భాగంగా మొలగవల్లి వద్ద నిర్మించే రిజర్వాయర్ సామర్థ్యాన్ని రెండు టీఎంసీలకు పెంచేలా సీఎం దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించారన్నారు. రిజర్వాయర్ పూర్తయితే ఆస్పరి మండలానికి తాగు, సాగు నీటికు డోకా ఉండదన్నారు. జొహరాపురంలో వివిధ పథకాల ద్వారా ప్రభుత్వం రూ.27 కోట్లు అందించిందన్నారు. గ్రామ పెద్ద సంజీవరెడ్డి, నాయకులు గుమ్మనూరు నారాయణస్వామి, దొరబాబు, మూలింటి రాఘవేంద్ర, కట్టెల గోవర్ధన, పెద్దయ్య, సుంకర రామాంజినేయులు, తహసీల్దార్ కుమారస్వామి, ఎంపీడీఓ రాణెమ్మ తదితరులు పాల్గొన్నారు.



జొహరాపురంలో లబ్ధిదారుడికి సంక్షేమ క్యాలెండర్ అందజేస్తున్న మంత్రి గుమ్మనూరు జయరాం

ఫర్టిలైజర్ దుకాణాల తనిఖీ

హాలహర్వి: చింతకుంట గ్రామంలో కదిరప్ప స్వామి ఫర్టిలైజర్ ఫెస్టిసైడ్స్ అండ్ సీడ్స్ దుకాణాలను బుధవారం ఏఓ శివశంకర్ తనిఖీ చేశారు. స్టాకు రిజిస్టర్‌లు, స్టాక్ బోర్డులను తనిఖీ చేయగా, ఇవేమీ సరిగా అప్‌డేట్ చేయకపోవడం వల్ల షాపులో ఉన్న దాదాపు రూ.లక్ష విలువ చేసే పురుగు మందుల అమ్మకాలను నిలుపుదల చేసినట్లు ఏఓ తెలిపారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దష్టికి తీసుకెళ్తామని చెప్పారు.

నాడు-నేడు పనులు పూర్తి చేయండి

కృష్ణగిరి: అన్ని పాఠశాలల్లో రెండో విడత నాడు-నేడు పనులను వేగవంతం చేయాలని ఎంఈఓ మద్దయ్య హెచ్‌ఎంలను ఆదేశించారు. మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలను ఆయన బుధవారం తనిఖీ చేసి అభివృద్ధి పనులను పరిశీలించారు. మండలంలో 32 పాఠశాలల్లో రెండో విడత నాడు-నేడు పనులు జరుగుతున్నాయన్నారు. వీటిగా త్వరగా పూర్తిచేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకొచ్చేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. హెచ్‌ఎం కల్పన ఉన్నారు.

పోస్టులు భర్తీ చేయండి

ఎమ్మిగనూరుటౌన్: సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాల్లో ఖాళీగా పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ఎస్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు వీరేష్‌యాదవ్ కోరారు. ఈ మేరకు బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ బంగారమ్మకు వినతిపత్రం వినతిపత్రం ఇచ్చారు. ఎస్ఎస్‌యూఐ నాయకులు పాల్గొన్నారు.

కుష్టు నివారణపై అవగాహన

ఆలూరు: కుష్టు వాధి లక్షణాలపై అవగాహన కల్పించి ప్రజలను అప్రమత్తం చేయాలని ఎంపీడీఓ అల్లబకాష్ ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లకు సూచించారు. స్థానిక సచివాలయం -2లో బుధవారం కుష్టు వ్యాధి నివారణపై కమ్మరచేడు పీహెచ్‌సీ డిప్యూటీ పారామెడికల్ అధికారి గురుప్రసాద్ సమక్షంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామాల్లో సీజనల్ వ్యాధులు సోకకుండా వైద్య సిబ్బంది కృషి చేయాలన్నారు. చర్మంపై స్పర్శ లేని రాగి రంగు మచ్చలు, లేదా చర్మం పొడిగా మారడం, కను బొమ్మల వెంట్రుకలు రాలిపోవడం, చర్మం ఉబ్బెత్తుగా మారడం, చేతుల నుంచి వస్తువులు జారిపోవడం, చేతివేళ్ల, కాలి వేళ్ల వంకరపోవడం, కాళ్లకు చెప్పులు జారిపోవడం, చల్లని, లేదా వేడి వస్తువులు పట్టుకున్నా స్పర్శ లేకపోవడం, పాదాలు (మడిమల వద్ద) వాపు వంటి లక్షణాలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించి ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. కృష్టు బాధితులకు అన్నిరకాల మందులు అందుబాటులో ఉన్నాయన్నారు. సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణం వేగవంతం చేయండి

నందవరం: నాగలదిన్నె- మంత్రాలయం బీటీ రోడ్డు నిర్మాణ పనులు వేగంగా పూర్తి చేయాలని ఆర్‌అండ్‌బీ ఈఈ కృష్ణారెడ్డి సీఈఆర్ కంపెనీ సిబ్బందికి సూచించారు. బుధవారం మండల పరిధిలోని నాగలదిన్నె, చిన్నకొత్తిలి, పెద్దకొత్తిల్లి గ్రామాల వద్ద కల్వర్టు, ట్రెంచ్ రోడ్డు పనులను ఆర్‌అండ్‌బీ అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు. కల్వర్టులు, ట్రెంచ్ రోడ్డు పనుల్లో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. నాగలదిన్నె - మంత్రాలయం వరకు దాదాపు 18 కిలోమీటర్ల బీటీ రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం రూ.18 కోట్లు మంజూరు చేసిందన్నారు. డబుల్ లైన్ నిర్మాణంతో రోడ్డు పనులు వేగవంతంగా జరుగుతున్నాయని వివరించారు. అందులో 7 కల్వర్టులు, ట్రెంచ్ రోడ్డు పనులు జరుగుతున్నాయన్నారు. జూలై చివరి నాటికి రోడ్డు నిర్మాణం పూర్తి కావాలని కంపెనీ సిబ్బందిని ఆదేశించారు. ఆగష్టు మొదటి వారంలో రాకపోకలు సాగించాలన్నారు. ఆర్‌అండ్‌బీ డీఈ నాగరాజు, ఏఈ సాయిసురేష్, ఏజెన్సీ సభ్యులు ప్రవీణ్‌కుమార్ రెడ్డి తదితరులు ఉన్నారు.



పెద్దకొత్తిలి వద్ద ట్రెంచ్ రోడ్డు నాణ్యతను పరిశీలిస్తున్న ఆర్‌అండ్‌బీ ఈఈ కృష్ణారెడ్డి

ఫ్యామిలీ డాక్టర్‌తో మెరుగైన వైద్య సేవలు

నందవరం: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్యామిలీ డాక్టర్ విధానంతో గ్రామాల్లో ప్రజల ఇంటి వద్దకే వెళ్లి మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని డాక్టర్ సౌజన్యలత పేర్కొన్నారు. బుధవారం మండలంలోని పెద్దకొత్తిలి గ్రామంలో 104 ద్వారా గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు ఇంటికి వెళ్లి వైద్య సేవలు అందించారు. గ్రామంలో గర్భిణులు, బాలింతలకు టీకాలు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. జ్వరం, దగ్గు, నొప్పులు వంటి వారికి మందులు అందజేశారు. హైరిస్క్ గర్భిణులకు ఆరోగ్య సూచనలు చేశారు. రక్తహీనత నివారణకు ఆకుకూరలు, కూరగాయాలతో పాటు పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. కాల్షియం మాత్రలు పంపిణీ చేశారు. ఎంఎల్‌హెచ్‌పీ బాలనరసమ్మ, ఏఎన్‌ఎం పుష్పావతి, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, 104 సిబ్బంది పాల్గొన్నారు.



పెద్దకొత్తిలిలో వైద్య సేవలందిస్తున్న డాక్టర్ సౌజన్యలత

కర్ణాటక మద్యం స్వాధీనం

గోనెగండ్ల: కర్ణాటక మద్యం అక్రమంగా తరలిస్తున్న బోయ రంగస్వామిని బుధవారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ పి.తిమ్మారెడ్డి తెలిపారు. వివరాలు.. గోనెగండ్లకు చెందిన బోయ రంగస్వామి కర్ణాటక రాష్ట్రానికి చెందిన జాన్స్ ఒరిజినల్ ఛాయిస్ మద్యం టెట్రా 90 ఎంఎల్ ప్యాకెట్లను స్థానిక భారత్ గ్యాస్ గోడౌన్ దగ్గర బుధవారం ఉదయం తరలిస్తుండగా పట్టుకొని అరెస్టు చేసినట్లు చెప్పారు. అతని వద్ద నుంచి 192 కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకుని బైక్‌ను సీజ్ చేసినట్లు చెప్పారు. నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపారు.

వెల్దుర్తి: మండల పరిధిలోని బోయనపల్లె, గోవర్ధనగిరి గ్రామాలలో బుధవారం కోడుమూరు సెబ్ బృందంతో కలిసి వెల్దుర్తి పోలీసులు జరిపిన సోదాల్లో ఆయా గ్రామాలకు చెందిన ఇద్దరు మహిళల నుంచి 64 కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.



నిందితుడి అరెస్టు చూపుతున్న పోలీసులు

కానుకలు హుండీలోనే వేయండి

హొళగుంద: ఎల్లార్తి శేక్షావలి, షాషావలి దర్గాలకు వచ్చే భక్తులు కానుకలు, విరాళాలను హుండీలో మాత్రమే సమర్పించాలని, బయటి వ్యక్తుల చేతికి ఇచ్చి మోసపోవద్దని వక్ఫ్ బోర్డు సీఈఓ అబ్దుల్ రహిమాన్, జిల్లా చైర్మన్ నియాజ్‌అహమ్మద్ సూచించారు. బుధవారం వారు దర్గాలను సందర్శించి ప్రత్యేక ఫాతెహాలు నిర్వహించిన అనంతరం దర్గాల్లోని వసతి సౌకర్యాల గురించి భక్తులను అడిగి తెలుసుకున్నారు. హుండీలకు సీల్ వేసి దర్గా ఆవరణల్లో సూచిక బోర్డులు ఏర్పాటు చేశారు. దర్శనానికి వచ్చిన భక్తులను చందాలు రాయాలని, కానుకలు ఇవ్వాలని బయటి వ్యక్తులు ఒత్తిడి చేస్తే తమకు సమాచారం ఇవ్వాలని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. వక్ఫ్‌బోర్డు ఈఓ, అధికారులు, కమిటీ సభ్యులు ఉన్నారు.



ఎల్లార్తి దర్గాలో హుండీకి సీల్ వేస్తున్న వక్ఫ్ బోర్డు జిల్లా చైర్మన్, సీఈఓ